'నాన్నకు నాపైన యింత ప్రేమ వుందా సార్? ఎంత గుడ్డివాడినయ్యాను. కానీ సార్, నాక్కో సందేహం. మీకు అంతా తెల్సుకదా? తెల్సికూడా దిష్టిబొమ్మ నిచ్చి యింత నాటకం ఎందుకు ఆడేరు సార్? విషయం అంతా మీరు నాకు ఏనాడో చెప్పి వుండవచ్చు కదా? నాన్న వద్దకు నన్ను చేర్చివుండ వచ్చుకదా?'

'సకారణంగానో, అకారణంగానో కొందరిపట్ల ద్వేషం కలగవచ్చు మార్కండేయులూ. కోపం రావచ్చు. ఆ కోపాన్ని ద్వేషాన్ని మనసులోనే నొక్కిపెడ్తే, అవి పెరుగుతాయే కానీ తరగవు. ఎదుటివాడిలోని మంచితనాన్ని, ప్రేమను చూడనివ్వవు. మనిషిలోని మానవత్వానికి, సమాజానికి, ముప్పు వాటిల్లుతుంది. కోపాన్ని, పగని, ద్వేషాన్ని పెంచుకొన్న ఆ వ్యక్తి కుటుంబానికి, సమాజానికి, దేశానికి దిష్టిబొమ్మగా మారతాడు. అలా కాకుండా వుండాలంటే కోపాన్ని, ద్వేషాన్ని, పగని ఏదో రూపంలో తీర్చుకోటం అవసరం. అందుకే ఆ 'దిష్టిబొమ్మ నాటకం' ఆడవల్సి వచ్చింది నేను.

'నాకెంతో మేలు చేసేరు సార్. మా నాన్న దిష్టిబొమ్మను అన్నిసార్లు చంపి వుండకపోతే నాన్నను చంపాలన్న నా పగ చల్లారేది కాదేమో। ఆయన కాఠిన్యం వెనకగల అనురాగతత్వం యిప్పటికి నేను అర్థం చేసుకోలేకపోయే వాడినేమో।'

మార్కండేయులు దత్తాత్రేయశర్మ కాళ్లకు నమస్కరించాడు.

'పీడా పోయిందిలే మార్కండేయులూ. మీ నాన్న దిష్టిబొమ్మ నీకు పట్టిన దిష్టిని తొలగించింది. నీ మనసుకు పట్టిన మాలిన్యాన్ని కడిగేసి నిర్మలం చేసింది. కానీ యిక ముందెప్పుడూ ద్వేషం అన్న మాలిన్యాన్ని మనసుకు అంటించుకోకు' మార్కండేయుల్ని లేవదీసి గుండెలకు హత్తుకొంటూ అంది సుహాలతమ్మ.

'యింకానా అమ్మా? మీ గుండెల్లో చోటుదొరికేక కూడానా?'

ఆమె గుండెల్లో తలదూర్చి చిన్న పిల్లాడిలా ఏడుస్తూ మెల్లగా గొణుక్కొన్నాడు మార్కండేయులు.



# నాకు నచ్చిన నా కథ



విద్యా వీచికలు అనుదినం విస్తరిస్తున్నకొద్దీ నూతన తరంలో విజ్ఞాన జిజ్ఞాస బాగా వేళ్లూనుకుంటోంది. అలాగే సాహితీ ప్రక్రియలోనూ అనేక వినూతన ప్రయోగాలు పొడసూపుతున్నాయి.

మొదటినించీ నాకు విజ్ఞాన విషయాలపై కథలు రాయాలనే పిపాస మెండు. అలా అనేక కథలు రాసినా, బ్లడ్‌గ్రూప్స్‌ను ఆధారం చేసుకుని రాసిన ఈ కథ నన్నే కాదు, 'అపరాధ పరిశోధన' మాస పత్రిక ఫిబ్రవరి–79 సంచికలో ప్రచురింపబడి అశేష పాఠక ప్రియులనూ ఆకట్టుకుంది।

అజీజ్

## రక్త తర్పణం!

"మే ఐ కమిన్ సర్?"

"ఎస్।"

స్ప్రింగ్ డోర్స్ కిర్రుమంటూ తెరుచుకున్నాయి. లోనికి వచ్చింది నర్సు.

కనుబొమ లెగరేశాడు స్వర్గనాథ్.

"ఎమర్జెన్సీ కేసు వచ్చింది డాక్టర్!"

"ఏ కేసు?"

"కారు ఏక్సిడెంట్!"

"బాగా తగిలాయా గాయాలు?"

"ఔను. పేషెంట్ స్పృహలో లేదు. పోలీసులు తీసుకొచ్చారు అంబులెన్స్‌లో."

"పద. వస్తున్నాను." అంటూ పుస్తకాన్ని బల్లపై బోర్లించి లేచాడు స్వర్గనాథ్.

కుర్చీ వెనక వేళాడుతున్న తెల్లకోటు తొడుక్కొని, టేబుల్ మీది స్టెతస్కోప్ అందుకుని, రిస్టువాచీ చూసుకున్నాడు. రాత్రి ఒంటి గంట! నర్సుని అనుసరిస్తూ అపరేషన్ థియేటర్లోకి నడిచాడు.

రక్తసిక్తమైన బట్టలతో టేబిల్ మీద పడున్నాడు పేషెంట్. అతని కిరుపక్కలా పోలీసులూ, వార్డ్‌బాయ్‌లూ ఉన్నారు. టేబిల్ని సమీపించి, పేషెంట్ మొహం చూడగానే ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు స్వర్గనాథ్!

కరెంట్ షాక్ హఠాత్తుగా తగిలినప్పుడు ఒంట్లోని నరాలన్నీ ఝల్లు మంటాయి. శరీరంలో రక్తప్రావం స్తంభించి, మనిషి స్తబ్ధుడైపోతాడు క్షణం పాటు. సరిగ్గా అటువంటి స్థితికే గురయ్యాడు డాక్టర్ స్వర్గనాథ్!

సుమారు ముప్పై ఏళ్ళుంటాయతనికి. నుదుటమీద జీరాడే ఉంగరాల జుత్తు. నిండైన బుగ్గలు. కోటేరు ముక్కు. అతనే!! మధుప్రసాద్!!

చుట్టూ నిల్చున్నవారు తనలో మారుతున్న రంగుల్ని పసిగట్టకముందే, సాధ్యమైనంత త్వరగా కోలుకోగలిగాడు స్వర్గనాథ్. పేషెంట్ ఒంటిమీది బట్టలు తొలగించి, చకచకా గాయాలు పరీక్షించాడు. మోచేతులూ, మోకాళ్ళూ బాగా ఒరుసుకు పోయాయి. పక్క టెముకల్లో ఒకటి విరిగినట్టుంది. తలకు తీవ్రమైన గాయాలు తగిలాయి.

అపరేషన్ చెయ్యక తప్పదు. రక్తస్రావం విపరీతంగా జరిగింది. వెంటనే అతని బ్లడ్‌గ్రూప్ పరీక్షించి, రక్తం ఎక్కించడం అత్యవసరం!



బ్లడ్ బ్యాంక్ హాస్పిటల్లోనే ఉంది. వివిధ వ్యక్తులు దానంచేసిన రకరకాల గ్రూపుల రక్తం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది అందులో....

ఇటువంటి అపరేషన్ కేసులు వస్తే తక్షణం చీఫ్‌కు ఫోన్‌చేసి పిలిపించాలి.

ఆపరేషన్ కేసులన్నీ ఆయనే డీల్ చేస్తారు. ఐతే, పేషెంట్ బ్లడ్ గ్రూప్ చెక్ చెయ్యడానికీ, ఇతర పరీక్షలకు కాస్త టైం పడుతుంది. అంతవరకూ గాయాలకు ప్రాథమిక కట్లు కట్టి, గ్లూకోజ్ ఇచ్చి, చీఫ్‌కు ఫోన్ చెయ్యాలి.

అనుకుంటూ నర్సు ద్వారా పేషెంట్ గాయాలు శుభ్రం చేయించి. కట్లు కట్టి, పోలీసుల దగ్గర స్టేట్‌మెంట్ తీసుకున్నాడు స్వర్గనాథ్. తరవాత గ్లూకోజ్ ఎక్కించమని నర్సుకు పురమాయించి, చీఫ్‌కు ఫోన్‌చేసి, నెమ్మదిగా తన గదికి చేరి, కుర్చీలో చతికిలబడి, కళ్ళు మూసుకున్నాడు.

అతని హృదయంలో, సన్నగా పొగమంచులా కురుస్తున్న దుఃఖం లోంచి క్రమక్రమంగా ఓ రూపం సాక్షాత్కరిస్తోంది. అతన్ని చూసి చిన్నగా నవ్వుతోంది!

"హూ....ర్ణి....మా!" అప్రయత్నంగా పలికాయి అతని పెదాలు.

'నన్ను మర్చిపోయావు కదూ అన్నయ్యా? ఇన్నాళ్ళ తరువాత మళ్ళీ నా గురించి ఆలోచిస్తున్నావు కదూ!' ప్రశ్నిస్తోంది ఆ రూపం పేలవంగా నవ్వుతూ.

'కాదమ్మా! నువ్వు జ్ఞప్తికి రానిరోజు లేదు. ఇంట్లో అడుగుపెట్టిన మరుక్షణం, పూలహారంతో గోడకు వేలాడే నీ ఫోటో అనుక్షణం నిన్ను గుర్తుకు తెస్తుంది. నా మనసుని ఛిద్రం చేస్తుంది. నీ అర్థాంతర చావుకు కారకుడైన ఆ నీచుడు ఎక్కడ కనిపించినా, ఎప్పుడు కనిపించినా, వాడి అంతంచూసి నీ ఆత్మకు శాంతి కలిగించాలని నా మనసు తహ తహలాడిపోతుంది.

'ఇన్నాళ్ళకు అనుకోకుండా ఆ అవకాశం చిక్కిందమ్మా! వాణ్ణి నరకానికి పంపేవరకూ నేనిక నిదరపోను.' ఆక్రోశిస్తోంది అతని మనసు మూగగా. పొరలు పొరలై పొంగివస్తున్న ఉద్వేగాన్ని అతి కష్టంమీద అదిమిపట్టి కళ్ళు తెరిచాడు స్వర్గనాథ్.

తొందర పడకూడదు. ఇలాంటి విషయాల్లో నిదానం ప్రధానం! టేబిల్ మీది సిగరెట్ కేస్, లైటర్ అందుకున్నాడు. సిగరెట్ అంటించి, నెమ్మదిగా రిలాక్స్ కాసాగాడు. పైన కాలచక్రంలా గిరగిర తిరుగుతోంది సీలింగ్ ఫాన్. దాని రెక్కలమధ్య ముక్కలై ఒక్కటొక్కటిగా అతని ఒళ్ళో పడుతున్నాయి గతించిన ఘటనలు!

మెడిసిన్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు తను. తల్లిదండ్రులకు తామిద్దరే సంతానం! పూర్ణిమ తనకంటే మూడేళ్ళు చిన్నది. బి.ఎస్.సి రెండో సంవత్సరం చదువుతుండేది. ఆ రోజుల్లో చదువుతో పాటు టెన్నిస్ పిచ్చి కూడా ఉండేది తనకు.

మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తూ ఆ వీధిలోనే నివసించే ఓ మిత్రుడితో సాయంకాలాలు టెన్నిస్ ఆడుతూ గడిపేవాడు. అప్పుడప్పుడూ పూర్ణిమ కూడా తమ ఆటలో పాలు పంచుకునేది. తను ఉన్నా, లేకున్నా అతను క్రమం తప్పకుండా తమ ఇంటికి వచ్చి, పూర్ణిమతో ఆడి పోతుండేవాడు.

అతనే మధుప్రసాద్!"

ఒకరోజు తాను కాలేజీనించి ఇంటికివచ్చి చూస్తే మూసిఉన్న ఓ గదిలోంచి పెద్దగా కేకలు వినిపించసాగాయి. చటుక్కున తలుపు తోసి లోని కెళ్ళాడు. పూర్ణిమ ఏడుస్తూ, తల్లి ఆమెమీద విరుచుకుపడుతూ కనిపించారు. తల్లి చేతిలో ఏదో కాగితం రెపరెప లాడుతోంది.


అడిగాడు ఏం జరిగిందని?

"ఇంకా ఏం జరగాలి నాయనా? తెలిసిన కుర్రాడు కదా అని ఆ వెధవని ఇంటికి రానిస్తే గారడీచేసి దీన్ని వల్లో వేసుకున్నాడు. ఎన్నాళ్ళనించి సాగుతోందో ఈ ఉత్తరాల భాగోతం! ఈ రోజు నా కంటబడింది. ఆ వెధవ దీనికి రాసిన ఉత్తరం చూడు!" అంటూ ఆ కాగితాన్ని అందించింది తల్లి.

అది పూర్ణిమ అతనికి రాసిన ఉత్తరానికి ప్రత్యుత్తరం! ప్రేమలేఖ!!

అది చదివాక, తల్లిలా చిందులు తొక్కలేదు. కేకలెయ్యలేదు. తెలిసీ






తెలియని వయసు. పరిపక్వత లేని మనసు! ఆ వయసులో అటువంటి తప్పటడుగులు సహజమేనవీ, ఐతే, మతపరంగాకానీ, అంతస్థు దృష్ట్యాగానీ, అతను తమకెందులోనూ సరితూగడనీ, మళ్ళీ అటువంటి పొరపాట్లు చెయ్యొద్దనీ, నయాన నచ్చజెప్పాడు చెల్లికి.

అంతటితో ఊరుకోలేదు. మళ్ళీ తమ ఇంటిఛాయలకు రావడంగానీ, పూర్ణిమను కలుసుకోవడం అటుంచి, ఆమెవైపు కన్నెత్తి చూసే ప్రయత్నం గానీ చేసిన పక్షంలో ఎముకలు సున్నంకిందకి మారతాయని హెచ్చరించి మరీ వచ్చాడు మధుప్రసాద్‌ని.

అంతే! ఆ సంఘటన జరిగిన కొద్ది కాలానికే ఇద్దరూ రెక్కలు మొలిచిన పక్షుల్లా ఇళ్ళూ, వాకిళ్ళూ వదలి అంతుచిక్కకుండా అదృశ్యమైపోయారు. తన నగా, నట్రా, బట్టలూ అన్నీ వెంట తీసుకుపోయింది పూర్ణిమ.

వెతికారు, వెతికించారు. అనుమానమున్న ప్రదేశాలన్నీ గాలించారు. నిష్ప్రయోజనం! వారి ఛాయలు కూడా కానరాలేదు ఎవ్వరికీ. ఆ నీచుడు అంతకు తెగిస్తాడనీ, పూర్ణిమ అంత సాహసానికి ఒడిగడుతుందనీ ఊహించలేదు ఎవ్వరూ!

అంతా మాయ! గుడ్డి ప్రేమకు ఇంగితజ్ఞానం ఎక్కడిది? అటువంటి వ్యవహారాల్లో మగాడి కేలోటూ జరగదు. నిక్షేపంగా ఉంటాడు ఎటొచ్చీ ఆడపిల్ల

తరవువారే నరకాన్ని అనుభవించేది.

ఏ మచ్చా లేక గౌరవంగా బ్రతికిన కుటుంబం! ఎంత అప్రతిష్ఠ! ఎంత అవమానం! ఊళ్లో తలెత్తుకు తిరగలేకపోయారు. ఆ భారాన్ని మోయలేక, చితికి, చితికి శల్య శరీరులై ఒకరి వెనక ఒకరు నిశ్శబ్దంగా నిష్క్రమించారు తల్లిదండ్రులు.

ఆ తరవాత కొద్ది కాలానికి విజయవాడ నించి ఓ టెలిగ్రాం వచ్చింది తన పేర.

'పూర్ణిమ సీరియస్, స్టార్ట్ ఇమీడియట్లీ!'

కట్టుబట్టలతో ఉన్నపళంగా బైలుదేరాడు. టెలిగ్రాంలో ఉదహరించిన చిరునామాకు వెళ్ళి చూస్తే అప్పటికే జరగవలసిందేదో జరిగి పోయింది. పూర్ణిమ మరణించింది!

సహజ మరణం కాదు!! ఆత్మహత్య!!!

పోలీసులు ఇచ్చిన టెలిగ్రాం అది. ఆమె ఉరిపోసుకున్న గదిని గాలిస్తే ట్రంకుపెట్టె అడుగున ఓ డైరీ దొరికిందట. అందులో రాసున్న తమ చిరునామా ఆధారంగా అవతలి వ్యక్తులు ఆందోళన పడకుండా "సీరియస్" అని మాత్రం ఇచ్చారట టెలిగ్రాం!

గత ఆర్నెల్లనించీ ఆ అమ్మాయి ఓ యువకుడితో ఆ గదిలో నివసిస్తోందని చెప్పారు ఇరుగుపొరుగు. ఐతే, ఇప్పుడా యువకుడి ఐపులేదక్కడ. అంతేకాదు, ఆ ఇంట్లో చిల్లిగవ్వ గానీ, పూర్ణిమకు సంబంధించిన ఒక్క నగ గానీ లేవు. ఎక్కడుంటాయి?

అన్నీ హరించుకుపోయాక! శవాన్ని గుర్తుపట్టాడు తను ఆమె తన సోదరి పూర్ణిమేనని వెక్కివెక్కి ఏడుస్తూ. అటువంటి కేసుల్లో పోస్టుమార్టం తప్పనిసరి గనక, పోస్ట్‌మార్టంలో మరో రహస్యం బైటపడింది. పూర్ణిమ వట్టి మనిషి కాదు! మూడు నెలల గర్భిణి!!

అప్పుడు తను అనుభవించిన మనఃక్షోభ ఏ భాషలో వర్ణించేది? అన్నెం పున్నెం తెలియని అమాయకురాలిని ప్రేమ అనే పాశంలో బిగించి, నమ్మించి, ఐనవాళ్ళకు దూరంచేసి, మోజు తీరాక చింకిదుస్తులు విడిచినట్టు విడిచి పారిపోయిన ఆ కిరాతకుణ్ణి ఎలా క్షమించేది?



ఇనాళ్ళ తరవాత ఈనాడు దొరికింది ఆ సువర్ణావకాశం! ఐతే, తానిప్పుడు ఏకాస్త తొందర పడ్డా వ్యవహారం బెడిసి కొట్టవచ్చు. కర్ర విరక్కుండా పాము చచ్చే పథకం వెయ్యాలి. అదేదో వాడికి స్పృహ రాకముందే జరిగి పోవాలి. కళ్ళు తెరిచాడంటే తనని సులభంగా గుర్తు పడతాడు. తీవ్రంగా యోచిస్తోంది స్వర్గనాథ్ మస్తిష్కం!

అంతలో స్ప్రింగ్‌డోర్స్ తెరుచుకున్నాయి.

"చీఫ్ వచ్చారు డాక్టర్! అంది నర్సు.

లేచి, ఆమె ననుసరించాడు. అప్పటికే బైట తెలతెలవారుతున్నట్టు పక్షుల కిలకిలరావాలు వినిపిస్తున్నాయి. చీఫ్‌ను థియేటర్లోకి తీసికెళ్ళి చూపించాడు పేషెంట్‌ను. ఆయన కాసేపు మధుప్రసాద్‌ని పరీక్షించి, వెంటనే ఆపరేషన్‌కు ఏర్పాట్లు చెయ్యమని పురమాయించాడు.

రక్తస్రావం బాగా జరిగింది గనక, వెంటనే పేషెంట్ రక్తం ఏ గ్రూప్‌కు చెందిందో టెస్ట్ జేసి, బ్లడ్‌బ్యాంక్‌నించి బ్లడ్ బాటిల్ తెప్పించమన్నాడు. అప్పుడు మెరిసింది స్వర్గనాథ్ బుర్రలో ఓ పథకం! తిరుగు లేని పథకం!!

కర్ర విరక్కుండా పాము చచ్చే పథకం!!!

టెస్ట్ కోసం పేషెంట్ రక్తాన్ని కొద్దిగా తీసి, వెంటనే బ్లడ్ బ్యాంక్ లాబొరేటరీ ఇన్‌ఛార్జికి అప్పగించమనీ, ఎమర్జెన్సీ కేసు గనక, తక్షణం రిపోర్ట్ తీసుకు రమ్మనీ పురమాయించాడు నర్సుకు. బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి పేరు డాక్టర్ సతీష్‌కుమార్.

పది నిమిషాల్లో వచ్చేసింది మధుప్రసాద్ బ్లడ్ గ్రూప్ రిపోర్ట్.

ఓ- పాజిటివ్.

స్పెషల్ ట్రేలో ఆపరేషన్ క్కావలసిన ఇన్‌స్ట్రుమెంట్స్ సిద్ధం చెయ్యమని నర్సుకు ఆదేశించి, గబగబ బ్లడ్‌బ్యాంక్ వైపు నడిచాడు స్వర్గనాథ్. కాసేపట్లో అక్కణ్ణించి మధుప్రసాద్ శరీరంలో ఎక్కించడానికి "ఓ- పాజిటివ్" బ్లడ్ బాటిల్ పంపబడుతుంది ఆపరేషన్ థియేటర్‌కు.

ఆ లోపలే తను చెయ్యవలసిన పని చేసెయ్యాలి. బ్లడ్‌బ్యాంక్ ముందు నించి వెళుతూ, డాక్టర్ సతీష్‌కుమార్ లోపలున్నాడేమోనని ఓరగా చూశాడు. లేడు! బహుశా లాబొరేటరీలో ఉండి ఉంటాడు

ఇదే అదను ఓమారు చుట్టూ కలయజూసి, చటుక్కున గదిలో అడుగు పెట్టాడు. గోడవారగా నిలబెట్టి ఉంది నిలువెత్తు రిఫ్రిజిరేటర్. అందులోనే ఉంటాయి వివిధ గ్రూపులకు చెందిన బ్లడ్ బాటిల్స్. పిడి తిప్పి మెల్లిగా తెరిచాడు దాని తలుపు. లోపల అనేక అరలు.

ఆ అరల నిండా ఎర్రని, చిక్కని స్వచ్ఛమైన రక్తపు సీసాలు. వాటి కార్కులపై ఆయా గ్రూపులూ, మధ్యన ఆ రక్తం ఎవరు ఎప్పుడు దానమిచ్చారో వివరాలూ అంటించి ఉన్నాయి. కింది అరలో చిట్ట చివర ఉన్న ఓ బాటిల్ మీద నిలిచింది అతని దృష్టి.

దాని కార్కుపై "బి– నెగెటివ్" అని ముద్రించి ఉంది. బాటిల్ మధ్య లేబిల్ పైన "డాక్టర్ స్వర్గనాథ్ సౌజన్యంతో" అని రాసుంది. చిన్నగా నవ్వుకున్నాడు. అది తన రక్తమే! రెండు రోజుల క్రితం తానే ఆ రక్తాన్ని బ్లడ్ బ్యాంక్‌కు దానమిచ్చాడు. కారణం. బి– నెగెటివ్ రక్తం చాలా అరుదుగా లభ్యమౌతుంది. తన శరీరంలో అది పుష్కలంగా ఉంది.

మనుషులందరి రక్తపు రంగు ఎరుపే అయినా, అందరి రక్తం ఒకే కోవకు చెంది ఉండదు. అందుకే వాటికి ఇలా గ్రూపులు నిర్ధారించబడ్డాయి. ఒక మనిషికి రక్తం అవసరమైతే, ఆ గ్రూపుకు చెందిన రక్తమే అతని కివ్వాలి. అలాగాక, మరో గ్రూపు రక్తం ఇచ్చిన పక్షంలో అతని ప్రాణానికే ముప్పు మూడే ప్రమాదముంది.

తనకు చెందని, తనలోని భాగం కాని ప్రతి పదార్థాన్ని మన శరీరం తిరస్కరించడం సృష్టి నైజం! ఉదాహరణకు ఒకమనిషి రక్తం "ఓ–పాజిటివ్" అయితే, ప్రమాదవశాత్తూ అతనికి రక్తం అవసరమైనప్పుడు అదే గ్రూపుకు చెందిన రక్తం ఇవ్వాలి. అందుకు విరుద్ధంగా "బి– నెగెటివ్" ఇస్తే మరుక్షణం అతని మరణం తథ్యం!

కారణం, అతని శరీరంలో ప్రవహించేది ఓ–పాజిటివ్ గనక, దానికి విరుద్ధంగా బి–నెగెటివ్ ఇవ్వడంతో అతని శరీరంలో ప్రవహించే ఓ–పాజిటివ్ రక్తం కలుషితమైపోతుంది. అదే అతని మరణానికి హేతువౌతుంది. ఈ సిద్ధాంతాన్నే తన పథకాని కుపయోగించ దలచాడు స్వర్గనాథ్.

క్షణం వృధా చెయ్యకుండా, పై అరలోని ఓ–పాజిటివ్ బాటిల్ కార్కు



తీసి, కింద అరలోని బి–నెగెటివ్ బాటిల్‌కు, దాని కార్కును ఓ–పాజిటివ్ సీసాకూ మార్చాడు. తరవాత, ఆ రెండు బాటిల్ మధ్య అంటించి ఉన్న లేబిళ్ళని గోళ్ళతో తియ్యడం ప్రారంభించాడు జాగ్రత్తగా. ఫ్రిజ్‌లోని తేమవల్ల సులభంగానే ఊడివచ్చాయవి.

వాటిని కూడా రెండు సీసాలకూ తారుమారు చేసి, తిరిగి అంటించాడు జాగ్రత్తగా. తరవాత, పై అరలోని బాటిల్ కింది అరలోనూ, కింది అరలోని బాటిల్ని పై అరలోనూ పెట్టి, నిశ్శబ్దంగా ఫ్రిజ్ తలుపుమూసి, చకచక బైటికి నడిచాడు.

ఆ లోపల అపరేషన్ థియేటర్లో కావలసిన ఏర్పాట్లు సిద్ధం చేసింది నర్సు. చీఫ్ ఉన్న గదిలోకి వెళ్ళి, అపరేషన్ కంతా రెడీ అయ్యిందని చెప్పాడు స్వర్గనాథ్. అయన థియేటర్లోకి వచ్చి, బ్లడ్ కలెక్ట్ చేసుకురమ్మని పురమాయించాడు నర్సుకు. గుండెలో సన్నగా దడ ప్రారంభమైంది స్వర్గనాథ్‌కు.

పది నిముషాల్లో బ్లడ్ బాటిల్ తెచ్చి, తలకిందులుగా స్టాండ్‌కు వేలాడదీసింది నర్సు.

అది తాను తారుమారు చేసిన బాటిలేనని గుర్తించి, కొద్దిగా కుదుటపడింది అతని మనసు.

చీఫ్ చేతులు వాష్ చేసుకుని, గ్లవ్స్ తొడుక్కుంటున్నారు. ఆలోగా స్పైయినల్ ఇవ్వడానికి సిద్ధమయ్యాడు స్వర్గనాథ్. స్పైయినల్ ట్రే తీసుకుని, లంబార్ పంక్చర్ నీడిల్ చూసుకున్నాడు. పేషెంట్ తలకు కట్టిన ప్రాథమిక కట్లువిప్పి, ఆ స్పేసంతా జాగ్రత్తగా క్లీన్ చేసాడు.

ప్రారంభమైంది అపరేషన్!

చీఫ్ వేళ్ళు చాకచక్యంగా, వీణ తీగల్ని మీటుతున్నంత సున్నితంగా పనిచేస్తున్నాయి. గాయాల్లో అక్కడక్కడా తెగిన బ్లీడింగ్ పాయింట్స్ పట్టుకుని 'టై' చేస్తున్నాడు. నలభై ఐదు నిమిషాల్లో ముగిసింది అపరేషన్. అక్కడక్కడా కుట్లువేసి, కట్లు కట్టేశారు. అంతా పూర్తయ్యాక, మళ్ళీ పల్స్, బి. పి. చెక్ చేశాడు స్వర్గనాథ్.

పల్స్ నిముషానికి 84 ఉంది. బి. పి. 120/70 ఎమ్. జి. మెర్క్యురీ ఉంది.

చీఫ్ వాష్‌బేసిన్‌లో చేతులు కడుక్కుంటూ, "బ్లడ్ ఎక్కించండి." అన్నాడు.

నర్సు వైపు చూసి తలూపాడు స్వర్గనాథ్. బ్లడ్ బాటిల్ వేలాడుతున్న స్టాండ్‌ని పేషెంట్ దగ్గరికి జరిపి, బాటిల్ కార్క్‌కు రబ్బర్‌పైప్ బిగించింది నర్సు. పైప్ చివరఉన్న సీదిల్ని పేషెంట్ కుడిచేతి వైన్‌లో గుచ్చింది. అంతే! చుక్కలు చుక్కలుగా నాథుప్రసాద్ శరీరంలోకి వెళ్ళసాగింది రక్తం!

అతనిక్కావలసిన 'ఓ-పాజిటివ్' కాదు.

అస్పత్రికి స్వర్గనాథ్ దానమిచ్చిన రక్తం!

బి-నెగెటివ్!

నర్సును అక్కడే ఉండి పేషెంట్ కండిషన్ చెక్‌చెయ్యమని చెప్పి, బైటకి నడిచాడు చీఫ్. స్వర్గనాథ్‌కూడా చేతులు వాష్ చేసుకుని, తనగదిలోకెళ్ళి కూర్చున్నాడు.

తృప్తి! అనూహ్యమైన తృప్తి అతని మనసునిండా అవహిస్తోంది. సిగరెట్ అంటించి, కుర్చీ వెనక్కి వాలి, కళ్ళు మూసుకున్నాడు. జీవితంలో మిగిలిన చివరి కాంక్ష తీరినట్టూ, ఎన్నాళ్ళుగానో మోస్తున్న గుండెమీది భారం దించుకున్నట్టూ ఫీలవుతున్నాడిప్పుడు.

పూర్ణిమ ఒక్కర్తేనా? ఆ నీచుడివంటి నీతిబాహ్యుల కబంధహస్తాల్లో చిక్కుకుని, బంగారంలాంటి బ్రతుకులు ధూళిపాలు చేసుకుంటున్న అమ్మాయిలు ఒక్కరా? ఇద్దరా? కోకొల్లలు! క్షణ భంగురమైన మోహపాశంలోపడి, కన్నూ మిన్నూ గానక, పెద్దలు గీచిన కట్టుబాట్ల నధిగమించి, రతనాలవంటి తమ జీవితాలను చిల్లిన గాజుపెంకుల్లా ఎందుకు మార్చుకుంటున్నారో ఈనాటి యువతులు?


అతని ఆలోచనలకి ఆనకట్ట వేస్తూ హడావుడిగా లోనికి వచ్చింది నర్సు. "డాక్టర్! ఆ పేషెంట్ స్థితి సీరియస్‌గా మారిపోతోంది!" అంది ఆయాసపడుతూ.

"ఏం జరిగింది?"

"ఇప్పటి వరకూ బాగానేఉన్న అతని పల్స్ హఠాత్తుగా 120 ఎమ్.టి.లోకి దిగింది. టెంపరేచర్ 120 డిగ్రీలు పెరిగింది. బి.పి. 90కి డ్రాప్ అయింది. నుదురూ, చేతులూ చల్లబడుతున్నాయి. బొవెల్ సౌండ్స్ లేవు. మైల్డ్ డిస్టెన్షన్ ఉంది. పోస్ట్ అపరేషన్ అలియస్‌లా ఉంది. ఇంటస్టయిన్స్ అంతగా హ్యాండిల్ చేసినట్టు లేదు. పేషెంట్ షాక్‌లోకి పోతున్నాడు." చెప్పింది నర్సు.

ఖంగారు నటిస్తూ, ఒక్క ఉదుటున లేచి నిల్చున్నాడు స్వర్గనాథ్. గబ గబ






చీఫ్ గదిలోకెళ్ళి, పరిస్థితి వివరించాడు. వెంటనే అయన అపరేషన్ థియేటర్లోకి వచ్చి పేషెంట్‌ని పరీక్షించాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఇహ మధుప్రసాద్‌ని ఆ పరబ్రహ్మ కూడా కాపాడలేడని స్వర్గనాథ్‌కు తెలుసు. బాగా తెలుసు!

"రైల్స్‌ట్యూబ్ అస్పిరేషన్. ఐ. వి. ఫ్లూయిడ్స్ కంటిన్యూ చెయ్యండి. బ్లడ్ స్లోగా ఇవ్వండి. ఎందుకైనా మంచిది, యెఫెడ్రైన్ డ్రిప్‌లోకి ఎక్కించండి. కాన్సర్వేటివ్ ట్రీట్‌మెంట్ ఇవ్వండి. చాలు ప్రస్తుతానికి, ఐ హోప్ హి విల్ బి అల్‌రైట్!" అని బైటికి నడిచాడు చీఫ్.

నర్సుతో కలిసి అయన ఇచ్చిన ఇన్‌స్ట్రక్షన్స్ ఫాలో కాసాగాడు స్వర్గనాథ్. నిమిషాలు దొర్లుతున్నకొద్దీ ఆ ప్రయత్నాలేవీ కలిసిరావడంలేదని స్పష్టమైంది. బి.పి. ఇంకా డ్రాప్ అయింది. పల్స్ వేగంగా, నీరసంగా కొట్టుకుంటోంది. కాళ్లూ, చేతులూ చల్లగా మంచులా మారుతున్నాయి.

"చూస్తుండు. చీఫ్‌ని పిల్చుకొస్తాను." అంటూ గబగబ బైటికి నడిచాడు.

చీఫ్ గదికెళ్ళి పరిస్థితి వివరించాడు. అయన హడావుడిగా వచ్చి పేషెంట్ పల్స్ చూసి, నెమ్మదిగా చెయ్యి కిందికి జారవిడిచాడు.

"ఎలా ఉంది డాక్టర్"? అడిగాడు స్వర్గనాథ్ ఆతృత నటిస్తూ.

"పోయాడు!"

ఎగిరి గంతెయ్యాలనిపించింది నాథ్‌కు.

"మన ప్రయత్నాలేవో మనం చేశాం! భగవంతుడి అభీష్టాన్ని మార్చడం ఎవరి తరం? పేపర్ వర్క్ కానిచ్చి, శవాన్ని పోలీసుల కప్పగించండి." అంటూ బైటికి నడిచాడు చీఫ్.

రాతలూ, కోతలూ పూర్తయి, పోలీసుల కప్పగించేసరికి ఉదయం పది గంటలైంది. నిజానికి స్వర్గనాథ్ డ్యూటీ ఉదయం ఏడుగంటలకే ముగుస్తుంది. ఈ గొడవలో ఇంతసేపు ఆగిపోవలసి వచ్చింది. అంతేగాక, అతనికి మరో ముఖ్యమైన పనికూడా చెయ్యవలసి ఉందక్కడ.

బ్లడ్ బ్యాంక్ రిఫ్రిజిరేటర్లో బి-నెగెటివ్ కార్డు బిగించిఉన్న ఓ-పాజిటివ్ బ్లడ్‌బాటిల్ అలాగే ఉంది. వెంటనే ఆ కార్డు, దాని లేబిలూ మార్చకపోతే ప్రమాదం! తనువెళ్ళాక, ఖర్మ గాలి మరేదైనా కేసు వస్తే ఆ పేషెంట్‌కు బి-నెగెటివ్ రక్తం అవసరమైతే, ఆ బాటిల్ రక్తం ఎక్కించే ప్రమాదముంది. అందులో ఓ-పాజిటివ్ రక్తం ఉంది మరి!

ఆ విధంగా తనవల్ల వేరొకరు అన్యాయంగా చావడం స్వర్గనాథ్ కిష్టం లేదు. ఆ పని పూర్తిచెయ్యడానికి బ్లడ్‌బ్యాంక్ ముందు రెండుసార్లు పచార్లు చేశాడు. ఐతే, పగలు కావడం వల్ల హాస్పటల్ సిబ్బంది ఎవరో ఒకరు వస్తూ పోతూనే ఉన్నారక్కడికి.

నిద్ర లేమివల్ల అతని కళ్ళు మండిపోతున్నాయి. నీరసం ముంచుకొస్తోంది. చూసి చూసి విసుగెత్తి, రాత్రి నైట్‌డ్యూటీకి వచ్చినప్పుడ చూసుకుందామని కార్లో బైలుదేరాడు ఇంటికి. సాధ్యమైనంత త్వరగా ఇల్లు చేరాలనే తొందర్లో స్పీడ్ కాస్త హెచ్చించాడు.

నిద్రమత్తువల్ల పక్క సందులోంచి మెయిన్‌రోడ్ మీదికి వస్తున్న మిలటరీ ట్రక్‌ను గమనించలేదు. సడన్‌గా దానిమీద దృష్టిపడి, లెఫ్ట్‌కు తప్పుకుందామని ప్రయత్నించే లోపల జరగవలసిన అలస్యం జరిగిపోయింది!

"ధన్!" మనే శబ్దంతో ట్రక్‌ను గుద్దేసింది కారు.

క్షణం పాటు ఏం జరిగిందో అర్థంలేకాదు స్వర్గనాథ్‌కు. ఒళ్ళంతా రోకటిపోటు. కళ్ళల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి క్రమంగా. అతనికి తెలియకుండానే నేలకొరిగి స్పృహ కోల్పోయాడు.

కళ్ళు తెరిచి చూస్తే తన హాస్పటల్లోనే, ఆ అపరేషన్ థియేటర్ బల్లమీదే పడుకున్నాడు. చుట్టూ పరిచయమున్న డాక్టర్లూ, నర్సులూ! తనగురించే ఆందోళనగా మాట్లాడుకుంటున్నారు. ఏదో చెప్పడానికి శాయశక్తులా ప్రయత్నించాడు. కంఠం దాటి ఇవతలకి రావడంలేదు స్వరం! కళ్ళు మూసుకున్నాడు నిస్సహాయంగా.

అప్పుడు వినిపించాయతనికి లీలగా చీఫ్ మాటలు. "వెంటనే అపరేషన్‌కు ఏర్పాట్లు చెయ్యండి. రక్తం చాలా కారిపోయినట్టుంది. బ్లడ్ గ్రూపింగ్‌కు ఎక్కువసెం తీసుకోవద్దు. త్వరగా ఎక్కించాలి రక్తం!"

"ఇతను చాలా అదృష్టవంతుడు సార్! ఇతని బ్లడ్ గ్రూప్ టెస్ట్ అవసరమే లేదిప్పుడు. రెండు రోజుల క్రితం ఆతనిచ్చిన రక్తం అలాగే ఉంది. బ్లడ్ బ్యాంక్‌లో బి-నెగెటివ్!" అది డాక్టర్ సతీష్‌కుమార్ కంఠం.

"ఇంకేం, వెంటనే తెప్పించండి దాన్ని! అంటున్నాడు చీఫ్.

స్వర్గనాథ్ గుండెలో ఇనపగుండ్లు దొర్లసాగాయి. వాళ్ళంటున్న బాటిల్లో ఉన్నది తన రక్తం కాదు. ఓ-పాజిటివ్! తన రక్తం ఎప్పుడో మధుప్రసాద్ మరణానికి దారితీసింది.

కళ్ళుతెరిచి, ఏదో చెప్పడానికి శతవిధాలా ప్రయత్నించాడు. మాట పెగిలి రావటంలేదు నోట్లోంచి. చేతులు కదలటం లేదు.

దాంతో భరించలేని భయాందోళనకు గురై మళ్ళీ స్పృహతప్పిందతనికి. అరగంట తరవాత స్టాండ్‌కు వేళాడుతున్న బాటిల్ ద్వారా చుక్కలు చుక్కలుగా స్వర్గనాథ్ శరీరంలోకి చేరసాగింది రక్తం!

అతనిక్కావలసిన నెగెటివ్-బి కాదు.

ఓ—పాజిటివ్!

